## బడా, బహుళ జాతి కంపెనీల ముందు

## రైతులను నిస్సహాయంగా బలిచేసేదే 'ఈ - నామ్'

**పంటల** కొనుగోలుదారుల మధ్య పోటీ తక్కువగా వుండటం, వ్యవసాయ మార్కెట్లు విడివిడిగా వుండటం, అసమర్ధ నిర్వహణ, మధ్యదళారులు అధికంగా వుండటం, తరచుగా ధరలలో మోసకారీతనం – వంటి సమస్యలను వ్యవసాయ మార్కెట్లు దేశ వ్యాపితంగా ఎదుర్కొంటున్నాయని, ఎలక్ట్రానిక్ జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ (ఇ–నామ్)ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని వ్యవసాయ మార్కెట్ వ్యవస్థను మార్చివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి, దాని అమలుకు పూనుకుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకూ అమలైన విధానాలను ఒక్కసారి పరిశీలిద్దాం.

1960–70ల నుండి వ్యవసాయ పంటల మార్కెటింగ్ (నియంత్రణ) చట్టాలను వివిధ రాష్ట్రాలు అమలు చేయటం ప్రారంభించాయి. పంటలు కొనుగోలు చేసే వ్యాపారుల మధ్య పోటీ తగ్గిపోవటం, వారంతా సిండికేటుగా మారి, కొనుగోలు ధరలను తగ్గించటం, మధ్య దళారీల పాత్ర పెరగటం, వ్యవసాయ పంటలకు అనుగుణంగా మార్కెట్ యార్డులలో మౌలిక వసతులు పెంపొందించకపోవటంతో, ఎంతో కొంత రైతుకు రక్షణ కల్పించే ప్రస్తుత మార్కెటింగ్ పద్ధతి, రైతులను నిలువుదోపిడీకి గురిచేస్తోంది.

1991 తర్వాత విదేశీవాణిజ్యంలో సరళీకరణ విధానాలకనుగుణంగా, తదనంతర కాలంలోని ప్రపంచవాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) నిబంధనలకనుగుణంగా, దేశవ్యాపితంగా వ్యవసాయ మార్కెట్లను సరళీకరించటం, బడాకార్పొరేటు, అంతర్జాతీయ వాణిజ్యానికి అనువుగా రూపొందించటం ప్రారంభమైంది.

దీనికనుగుణంగా కేంద్రప్రభుత్వం 2002, 2003లలో ప్రత్యేకించి కొన్ని ఆహార పంటల కొనుగోలుకు లైసెన్స్ అవసరాలను రద్దు చేసింది. ఆహారపంటల నిల్వపరిమితులను ఎత్తి వేసింది. ఇతర ప్రాంతాలకు చేరవేయటానికి ఆంక్షలను రద్దుచేసింది. అత్యవసర సరుకుల చట్టం (1995) పరిధిలోనున్న గోధుమ, ధాన్యం, బియ్యం, చెరకు, వంటనూనెలు, పప్పుధాన్యాలు మొదలైన వాటినన్నీ ఆ పరిధి నుండి తొలగించి, ప్రభుత్వ లైసెన్సు అవసరం లేకుండానే ఏ మోతాదులోనైనా కొనుగోలుచేయటానికి, నిల్వచేసుకోవటానికి, ఏ ప్రాంతానికైనా తరలించటానికి అనుమతినిచ్చారు. ఈ విధంగా 2003 నాటికి భవిష్య వాణిజ్యం (ఫ్యూచర్ ట్రేడింగ్), ఫార్వర్డ్ ట్రేడింగ్‌లకు ఆమోదం తెలిపారు.

వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర ప్రభుత్వ అంశమైనప్పటికీ, కేంద్రప్రభుత్వమే తన చేతుల్లోకి తీసుకుంది. వివిధ స్థాయిలలో చర్చల అనంతరం కేంద్రప్రభుత్వం స్టేట్ అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ – 2003 పేరుతో ఓ నమూనా చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వాల ముందుంచింది.

ఒక వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ప్రైవేటు వ్యక్తులు ఎందరైనా మార్కెట్ తెరవవచ్చుననీ, మార్కెట్ యార్డు ద్వారానే సరుకు అమ్మాలనే నిబంధన అవసరంలేదనీ, కాంట్రాక్టు వ్యవసాయ యజమానికి (కార్పొరేట్లకు) నేరుగా వ్యవసాయ పంటలను అమ్మవచ్చుననీ, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశిత సరుకులపై తమ విచక్షణతో ఒకేసారి పన్నువసూలు చేయవచ్చుననీ ఈ చట్టంలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా అత్యధిక రాష్ట్రాలు ఈ సవరణలతో కూడిన మార్కెటింగ్ చట్టాలను అమలుచేశాయి.

ఈ సవరణలన్నీ – కాంట్రాక్టు, కార్పొరేటు వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, బడా వ్యవసాయ వాణిజ్య వర్గాలను, బహుళ జాతి కంపెనీలను రంగప్రవేశం చేయించి వ్యవసాయ పంటలను, ఆహారధాన్యాలను ఎంత మోతాదులోనైనా కొనుగోలు చేసి, నిల్వచేసుకునేందుకు, సుదూర ప్రాంతాలకు తరలించి తమ వ్యాపారాన్ని పెంచుకోని అధికలాభాలు గడించేందుకు ఉద్దేశించినవే తప్ప, చిన్న, సన్నకారు, కౌలురైతాంగం పండించిన పంటలకు న్యాయమైన ధర కల్పించి, వారికి రక్షణ కల్పించేవి కావు. ఈ చట్టం చేసిన తర్వాత దశాబ్దన్నర కాలపు ఆచరణను పరిశీలించినా ఇదే రుజువైంది.

2022 సం॥ నాటికి రైతాంగం ఆదాయాలను రెట్టింపు చేస్తామని మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పెద్ద గొంతుతో చెబుతూవస్తోంది. కానీ, ఆరుగాలం కష్టించి పంటను పండించిన రైతాంగం, ఆ పంటను అమ్ముకోవటానికే నానాతంటాలు పడవలసివస్తోంది. న్యాయమైన ధరలు లేకపోవటంతోపాటు, నిల్వచేసుకొనే సౌకర్యాలు లేకపోవటం, అప్పులిచ్చిన వారివత్తిళ్ళు, మార్కెట్ మయాజాలం, రైతుకుదన్నుగా నిలవని ప్రభుత్వ కొనుగోలు సంస్థలు, దళారీల మోసకారీతనం, మొదలైన కారణాలతో పంటను తెగనమ్ముకోవలసి వస్తున్నది. అప్పులభారం పెరిగిపోయి అనేకమంది రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

ఈ పరిస్థితులలో గత వ్యవసాయ సీజన్‌లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు తదితర రాష్ట్రాల రైతాంగం – ప్రధానంగా రుణాల రద్దు, గిట్టుబాటు ధరల డిమాండ్స్‌పై మిలిటెంట్‌గా కదిలారు. తమిళనాడు రైతాంగ ప్రతినిధులు న్యూఢిల్లీలో వినూత్నంగా తమ రోజువారీ నిరసన కార్యకలాపాలతో సమస్యలను వెల్లడిచేశారు. మధ్యప్రదేశ్‌లో మందసోర్ వద్ద మిలిటెంట్ రైతాంగ ఆందోళనపై పోలీసులు కాల్పులు జరిపి మొత్తంగా ఆరుగురు రైతులను బలిగొన్నారు. రైతాంగ ఆందోళనకు తలొగ్గిన మహారాష్ట్ర ప్రభుత్వం, రైతాంగ రుణాల రద్దుకు సుముఖత వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోనూ రుణాలరద్దు నిర్ణయాన్ని అమలు జరపాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరకావాలని రైతాంగం రోడ్లపైకొచ్చారు. రైతుల ఆగ్రహానికి

తెలంగాణ రాష్ట్రం – ఎనుమాముల మార్కెట్ యార్డు దగ్ధమైంది. గుంటూరు ప్రకాశం తదితర జిల్లాలలో మిర్చి, పసుపు, పొగాకు రైతాంగం, రోడ్లపై పంటను తగులబెట్టి నిరసనాందోళనలు చేపట్టారు. మచ్చుకు ఇవి కొన్ని ఆందోళనలు మాత్రమే.

ఈ నేపథ్యంలో రైతుల సమస్యలు పరిష్కరించే బదులుగా, రైతుల పంటకు న్యాయమైన ధరనందించేందుకు చర్యలను చేపట్టటానికి బదులుగా, వ్యవసాయ మార్కెట్లు అనుసంధానమై లేకపోవటం, మధ్యదళారుల తాకిడి అధికంగా వుండటం, కొనుగోలుదారులు సిండికేట్‌గా ఏర్పడం వంటి అంశాలే రైతుల పంటలకు మంచిధర రాకపోవటానికి కారణాలని తామే పెద్ద గొంతుతో పేర్కొంటూ దానికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం, దేశంలో ఎన్నిక చేయబడిన 585 హోల్‌సేల్ వ్యవసాయ మార్కెట్ల ద్వారా ఎలక్ట్రానిక్ వ్యవసాయ వ్యాపారం నిర్వహించటానికి పూనుకుంది.

ప్రభుత్వ మార్కెట్‌యార్డులన్నీ క్రమంగా ప్రైవేటుపరం చేయడానికి చర్యలను చేపట్టింది. రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ యార్డులను బహుళ జాతి కంపెనీలకు బార్లా తెరిచే 'అఖిలభారత వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చట్టాన్ని' చేయబోతున్నది.

దీనిలో భాగంగానే ఈ-నామ్ (ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ఫర్ నేషనల్ అగ్రికల్చరల్ మార్కెట్) పేరుతో, 2016 ఏప్రిల్ 14న ప్రధాని నరేంద్రమోదీ, ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించాడు. 2018 మార్చికల్లా దేశంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులన్నిటిలో ఈ విధానం అమలు చేయటానికి చర్యలు చేపట్టారు.

రైతులు వ్యవసాయ మార్కెట్ యార్డుకు పంటను తీసుకొని వచ్చిన తర్వాత, దానిని రాశులుగాపోసి, ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ద్వారా ఆ సరుకు అవసరమైన, లైసెన్సు కలిగిన వ్యాపారులందరి ముందు ప్రదర్శించాలి. కొనుగోలు చేసే వ్యాపారి దేశంలో నుండి గానీ, విదేశాల నుండి గానీ ఈ సరుకు చూసి, ఆన్‌లైన్‌లోనే తన రేటును ప్రకటిస్తాడు. నిర్దేశిత సమయంలోపు తన రేటును వ్యాపారి ఎన్నసార్లైనా మార్చుకోవటానికి అవకాశముంటుంది. వేలం సమయం ముగిశాక, మార్కెట్ యార్డులలోని టెలివిజన్ తెరలపై ఏ రైతు పంటకు ఏ రేటు కట్టబడిందో తెలుస్తుంది. రైతుకు ఆ రేటు అంగీకారమైతే ఆమోదం తెలపవచ్చు లేదా తిరస్కరించి మరోసారి తన పంటను ఆన్‌లైన్‌లో వుంచవచ్చు. ఈ సేవలకుగాను యార్డు యాజమాన్యానికి, కంప్యూటర్ కంపెనీకి రైతు, నిర్దేశిత రుసుము చెల్లించాల్సి వుంటుంది.

వ్యవసాయమార్కెట్ యార్డులలో ఈ-పద్ధతి అమలు సాధ్యా సాధ్యాలు ఒక ఎత్తైతే, ఈ విధానం ద్వారా రైతాంగాన్ని – ముఖ్యంగా సన్న, చిన్న, మధ్యతరగతి, కౌలు రైతాంగాన్నీ మరో ఆధునిక రూపంలో బడా కార్పొరేట్లు ముందు, బహుళ జాతి కంపెనీల ముందు నిస్సహాయంగా బలిచేయటమే అనేది నిస్సందేహం.

విత్తనాలు, ఎరువు, పురుగుమందులు మొదలుకొని వ్యవసాయ పంటల ఉత్పాదక ఖర్చును ప్రభుత్వం గణనీయంగా పెంచుకుంటూ పోతోంది. వ్యవసాయ పంటల ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి మార్కెట్ ధర కల్పించాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను సైతం అమలు చేయబూనుకోవటంలేదు. ఏటికి ఎదురీది రైతు పండించిన పంటకు 'మద్దతుధర' పేరుతో మొక్కుబడిగా ప్రభుత్వం ధరను ప్రకటిస్తున్నది. ఆ ధరకైనా ఆటంకాలు లేకుండా పంటను రైతులు అమ్ముకోవటానికి అవకాశం లేకుండా ప్రభుత్వమే ఎన్నో ఆంక్షలు విధిస్తోంది.

వ్యవసాయ పంటలు మార్కెట్‌లోకి వచ్చినపుడు ప్రభుత్వము లేదా ప్రభుత్వరంగ సంస్థల ద్వారా మద్దతుధరకైనా కొనుగోలు చేయించేందుకు ప్రయత్నించకుండా ప్రభుత్వాలు నిర్దాక్షిణ్యంగా రైతాంగాన్ని ప్రైవేటు బడా వ్యాపారులకు వదలి వేస్తున్నాయి. ధరల స్థిరీకరణనిధి, లేదా రివాల్వింగ్ ఫండ్‌లను ఏర్పాటుచేసి మద్దతుధర కంటే తక్కువకు పంటల కొనుగోలు ధరలు పతనమైతే, వెంటనే ప్రభుత్వం కొనుగోలుకు సిద్ధంకావాలి. దీనిని ప్రక్కన పెట్టిన ప్రభుత్వం, రైతాంగం నష్టపోతున్నారంటూ తానే పెద్ద గొంతుతో మాట్లాడి, ప్రత్యామ్నాయంగా ముందుకు తెచ్చిన 'ఈనామ్' విధానం కూడా రైతాంగ ప్రయోజనాలకేమీ తోడ్పడేది కాదు. చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతాంగాన్ని; యార్డులపై ఆధారపడి జీవనం సాగించే కార్మికుల జీవనోపాధిని; చిన్న వ్యాపారులను దెబ్బతీసి బడాకార్పొరేట్ల, బహుళజాతి కంపెనీలకే 'ఈనాము'గా తోడ్పడు తుందనేది వాస్తవం.

oooooo